సీహెచ్‌సీకి ప్రసవ వేదన

- అల్లవరంలో ఖాళీగా దర్శనమిస్తున్న స్త్రీల వార్డు
- గైనకాలజిస్టు లేక మహిళలకు అందని వైద్య సేవలు
- రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న గర్భిణులు



అల్లవరంలోని 30 పడకల ఆస్పత్రి



అల్లవరం సీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న స్త్రీల వార్డు

అల్లవరం: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని భావితరాలకు అందించగలమని ప్రకటనలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అల్లవరం సీహెచ్‌సీపై ఎందుకు చిన్నచూపు చూస్తోందో తెలియని పరిస్థితి నెలకొంది. పక్కా భవనాలు, పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నా డాక్టర్ల కొరత అల్లవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వేధిస్తోంది. రెండు నెలలుగా గైనకాలజిస్టు కొరతతో అల్లవరం సీహెచ్‌సీ ప్రసవ వేదనను భరిస్తోంది.

తగ్గుతున్న ఓపీ శాతం

అల్లవరం సీహెచ్‌సీలో గతంలో జనరల్ మెడిసన్, గైనిక్ డాక్టర్లు నిత్యం అందుబాటులో ఉంటూ గర్భిణులకు సుఖ ప్రసవాలు చేసి తల్లీబిడ్డలను ఇంటికి పంపించేవారు. హైరిస్కు ఉన్న గర్భిణులకు ఈ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి రక్షించిన దాఖలాలు అనేకంగా ఉన్నాయి. రెండు నెలలుగా ఇక్కడి గైనకాలజిస్టులను వేర్వేరా ఆస్పత్రులకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయడంతో గర్భిణులకు వైద్య సేవలు నిలిచిపోయాయి. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు సరైన వైద్య సలహాలు ఇచ్చే స్త్రీ వైద్యు నిపుణులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. గైనకాలజిస్టు లేక రెండు నెలలుగా ఈ ఆస్పత్రిలో డెలివరీలు జరగడం లేదు. ప్రసవాలు, శస్త్ర చికిత్స సేవలు లేక స్త్రీల వార్డు ఖాళీగా దర్శినమిస్తోంది. దీంతో రోజు రోజుకూ ఓపీ శాతం తగ్గిపోతోంది. డెలివరీ కోసం వస్తున్న గర్భిణులకు ప్రసవాలు చేయలేక వేరే ఆస్పత్రులకు వెళ్లాలని ఇక్కడి సిబ్బంది సూచిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అభివృద్ధికి ప్రాధాన్యం

2011లో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ కృషితో రూ.1.10 కోట్ల నిధులతో 30 పడకల ఆస్పత్రిని అల్లవరం మండలం కేంద్రంలో నిర్మించి ప్రజలకు అంకితం చేశారు. దశాబ్ద కాలం పాటు సేవలందించిన అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ చొరవతో రూ.3.90 కోట్ల నిధులతో అల్లవరం సీహెచ్‌సీ మొదటి అంతస్తును విస్తరించి, మౌలిక సౌకర్యాల కల్పను పెద్దపీట వేశారు. సివిల్ సర్జన్, జనరల్ మెడిసన్, గైనిక్, ఫిడియాట్రిక్స్, డెంటల్, ఫిజియోథెరఫీ, విభాగాల్లో వైద్యులను నియమించి రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించారు. బ్లడ్ బ్యాంక్, రక్త పరీక్షలు, ఎక్సరే, ల్యాబ్, స్కానింగ్ వంటి సౌకర్యాలు రోగులకు అందుబాటులో ఉంచారు. బయో మెడికల్ వేస్టు, 108 వాహనం పార్కు చేసేందుకు, మృతదేహాలకు పోస్టుమార్టం చేసేందుకు భవనాలను నిర్మించి వినియోగంలోకి తెచ్చారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అల్లవరం సీహెచ్‌సీ అభివృద్ధి పట్టనట్టు వ్యవహరిస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. రెండు నెలలుగా గైనకాలజిస్టు సేవలు నిలిచిపోయినా ఆ పోస్టు ఖాళీగా ఉన్నా కూటమి నేతలకు పట్టడం లేదు. సీహెచ్‌సీలో గైనిక్ డాక్టర్ లేక వైద్య సేవలు నిలిచిపోవడంపై జిల్లా వైద్య శాఖ నిద్రపోతుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అల్లవరం సీహెచ్‌సీపై ప్రభుత్వ నిర్లక్ష్యం మహిళలు, గర్భిణులకు శాపంగా మారింది. ఇప్పటికైనా జిల్లా వైద్యశాఖాధికారులు మేల్కొని గైనకాలజిస్టును తక్షణమే నియమించి గర్భిణులకు వైద్య సేవలందించాలని పలువురు నాయకులు కోరుతున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ అల్లవరం సీహెచ్‌సీలో గైనకాలజిస్టు సేవలు అవసరమని ఉన్నతాధికారులకు రెండు సార్లు నివేదించామని, మరోసారి లేఖ రాయనున్నట్టు ఆయన తెలిపారు.

ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అల్లవరం సీహెచ్‌సీలో ఆగస్టు వరకు గైనిక్ డాక్టర్ అందుబాటులో ఉన్నా సెప్టెంబర్‌లో గైనిక్ డాక్టర్ విధులు నిర్వర్తించకపోవడం వాస్తవమే. అక్టోబర్ నుంచి వారానికి రెండుసార్లు గైనకాలజిస్టు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గైనకాలజిస్టు పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదలయ్యింది.

– డాక్టర్ కార్తీక్, జిల్లా వైద్య విజ్ఞాన పరిషత్ అధికారి

పంచాయతీ చెరువులను ఆధునీకరించాలి



దేవగుప్తంలో సమస్యలపై మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ

అల్లవరం: దేవగుప్తంలోని పంచాయతీ చెరువులు ఆధునీకరణకు నోచుకోక అధ్వానంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతా రామకృష్ణ అన్నారు. దేవగుప్తం పంచాయతీ పరిధిలోని చెరువులను ఆధునీకరించాలని కోరుతూ నల్లగుంట గ్రామస్తులు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా గ్రామంలో అభివృద్ధి పనులేవీ చేపట్టలేదని, ఎవరైనా చనిపోతే శవాలను పూడ్చటానికి స్థలం లేదని రామకృష్ణ తెలిపారు. కనీసం శవాన్ని తీసుకెళ్లడానికి సరైన మార్గం లేదన్నారు. గ్రామంలో శానిటేషన్ లోపించిందని, పంచాయతీ కార్యదర్శులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రామకృష్ణ తెలిపారు. కలెక్టర్ స్పందించి పంచాయతీ చెరువుల ఆధునీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిట్టూరి వెంకటనారాయణ, పాలమూరి బాబురావు, గోసింగి రాజు, చింతా అశోక్, పీతల రమేష్, పిల్లే సత్యనారాయణ, శ్రీను, బండారు గోపాలం, బండారు దుర్గారావు పాల్గొన్నారు.

పాఠశాల విద్యాంశాలపై అవగాహన అవసరం



శిక్షణ వివరాలను తెలుసుకుంటున్న ఎస్‌సీఈఆర్‌టీ పరిశీలకురాలు సరిత

అల్లవరం: విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాంశాలపై అవగాహన అవసరమని ఎస్‌సీఈఆర్‌టీ అబ్జర్వర్ సరిత, జిల్లా విద్యా శిక్షణ సంస్థ పరిశీలకుడు రామకృష్ణ పేర్కొన్నారు. అల్లవరం మండలం ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని వారు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డీఎస్సీలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు వారి సబ్జెక్టుకు సంబంధించిన అంశాలతో పాటుగా, ఇతర సహ పాఠ్యాంశాలపై అవగాహన అవసరమన్నారు. విధుల్లో చేరిన అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటుగా విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందిస్తున్న ప్రోత్సాహకాలపై అవగాహన అవసరమన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులకు చేరువయ్యే విధంగా బోధన చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమం షెడ్యూల్‌ను కోర్సు కోఆర్డినేటర్ పి.రాంబాబు, కోర్సు డైరెక్టరు పి.వల్లయ్యశర్మ వివరించారు. విద్యార్థులు తయారు చేసిన టీఎల్‌ఎంను పరిశీలించి వారిని అభినందించారు. ఉప విద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశరావు, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణ, చోడిశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న సాంస్కృతి కార్యక్రమాలు : బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాల అనంతరం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. గణితం, ఫిజిక్స్, బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఆటపాటలతో అలరిస్తున్నారు. డీఎస్సీలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను ఉటంకిస్తూ ప్రదర్శించిన స్కిట్ అందరినీ అలరించింది.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



వెంకటేశ్వరబాబును సత్కరిస్తున్న పినిపే శ్రీకాంత్ తదితరులు

అమలాపురం రూరల్: పదవులు పొందిన నాయకులు వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన కుడుపూడి వెంకటేశ్వరబాబు, కుడుపూడి భరత్ భూషణ్‌కు అమలాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అసెంబ్లీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అభినందనలు తెలిపారు. బాబు, భరత్ భూషణ్ భట్నవెల్లిలోని మాజీ మంత్రి విశ్వరూప్ నివాసంలో డాక్టర్ పినిపే శ్రీకాంత్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబు, భరత్‌కు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. శ్రీకాంత్, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రూరల్ మండల అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరేళ్ళ రామకృష్ణ, కౌన్సిలర్ల గొవ్వాల రాజేష్ , కె.సన్నాయి దాసు, బండారు గోవింద్, చిట్టూరి పెదబాబు,చిత్రపు రామకృష్ణ నాయకులు నక్కా చంద్రశేఖర్, రేవు శ్రీను, సుంకర సుధ, కుడుపూడి రాము, బొక్క మూర్తి, కే.సాయి బాబు,,గోపి రమేష్ పాల్గొన్నారు.

దళిత ఉద్యమ నేత ఏడుకొండలుకు పొన్నాడ నివాళి



వడ్డి ఏడుకొండలు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్

తాళ్లరేవు: దళిత ఉద్యమ నాయకుడు, విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలుకు ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఘనంగా నివాళులర్పించారు. సుంకరపాలెం పంచాయతీ బాబానగర్‌లో అనారోగ్యంతో మృతి చెందిన ఏడుకొండలు భౌతికకాయానికి పొన్నాడ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పార్టీ నాయకుడు కాశి లక్ష్మణస్వామి తదితరులు ఉన్నారు.

పలువురి సంతాపం : ఏడుకొండలు మృతికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాస రాజు, దొమ్మేటి సామ్యూల్ సాగర్, వుంగరాల సంతోష్, పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, జిల్లా నాయకులు రేవు మల్లీశ్వరి, పెట్ల సూర్యనారాయణరాజు, అంకాడి అంజిబాబు, కాలా వెంకటరమణ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు శ్రీధర్ ఎంపిక



రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైన శ్రీధర్‌ను అభినందిస్తున్న డీఈవో బాషా

అమలాపురం టౌన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల కాకినాడలో నిర్వహించిన స్కేటింగ్ పోటీలో అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలుకు చెందిన విద్యార్థి శ్రీధర్ జిల్లాస్థాయిలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్లో 9వ తరగతి చదువుతున్న కె.కుమార్‌చందు శ్రీధర్ 100 మీటర్ల స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని, 300 మీటర్ల పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించాడు. త్వరలో రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీల్లో రాష్ట్రం తరపున శ్రీధర్ తలపడనున్నాడని స్కూలు ప్రధానోపాధ్యాయుడు కె. ఘనసత్యనారాయణ తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేత శ్రీధర్‌ను డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అభినందించారు. వార్డు కౌన్సిలర్ పిండి అమరావతి, స్కూలు పేరెంట్స్ కమిటీ చైర్మన్ మలిశెట్టి వీరాస్వామి, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనివాసరావు, బి.రామకృష్ణ, కేఆర్‌ఎస్ ప్రసాద్ తదితరులు శ్రీధర్‌ను ప్రశంసించారు.

అనధికార ఉప్పునీటి బోర్లు తొలగించాలని ఫిర్యాదు



తుమ్మలపల్లిలో ఉప్పునీటి బోర్లతో సాగు చేస్తున్న రొయ్యల చెరువులు

అల్లవరం: తుమ్మలపల్లిలో ఉప్పునీటి బోర్లు ఏర్పాటుచేసి వరి పొలాల్లో పంట నష్టానికి కారణమవుతున్న రొయ్యల చెరువుల యాజమాన్యాలపై చర్యలపై తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2018 నుంచి ఉప్పునీటి బోర్లు తొలగించాలని ప్రతి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నా నేటికీ పరిష్కారం కాలేదని అధికారులు చెరువుల వద్దకు వచ్చి చూసి వెళ్లిపోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మత్స్యశాఖ అధికారులు ఆక్వా రైతుల నుంచి మామూళ్లు తీసుకొని రొయ్యల సాగుని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఉప్పునీటి బోర్లతో వరి పంట దెబ్బతింటే కనీసం అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని నాగాబత్తుల గణపతిరావు, వెంకటేశ్వరరావు, వడ్డీ అర్జున్, ఉడుము రామకృష్ణ పాల్గొన్నారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజుల్లో ఉప్పునీటి బోర్లని తొలగించి, విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని రైతులకు హామీ ఇచ్చారు.

దళిత నేత నాగేశ్వరరావు మృతికి సంతాపం

యానాం: నియోజకవర్గ పరిధిలో దరియాలతిప్పకు చెందిన దళిత నేత, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సభ్యుడు ఉపాశక కోరుకొండ నాగేశ్వరరావు (53) సోమవారం ఆకస్మిక మృతిపై పలువురు దళిత సంఘాల నేతలు సంతాపాన్ని వ్యక్తం చేసారు. అంబేడ్కర్ భావజాలాన్ని, బౌద్ధ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు బుద్ధుని సిద్ధాంతాలను ఆచరించి చూపి ఆదర్శంగా నిలిచారని వారన్నారు. బుద్ధుని విగ్రహాలను వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన కోరుకొండ నాగేశ్వరరావు చిరస్మరణీయులని ఏపీ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వై హరిబాబు, యడ్ల కుటుంబరావు, దళిత యువ జన సంఘాల సభ్యులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కొమరగిరిపట్నం పంచాయతీకి పురస్కారం

అల్లవరం: స్వచ్ఛత, పారిశుద్యం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, ఘనీభవ ఆర్థిక వ్యవస్థ విభాగాల్లో కొమరగిరిపట్నం పంచాయతీకి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర పురస్కారం వరించిందని సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి సోమవారం తెలిపారు. అమలాపురం సత్యనారాయణ గార్డెన్‌లో కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్టు సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు, పారిశుద్య కార్మికుల సహకారంతో ఈ పురస్కారం రావడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు.

శివాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

తాళ్లరేవు: ఉప్పంగల గ్రామంలోని పురాతన శివాలయం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఉప్పంగలలోని శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సుమారు రూ.7 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అభివృద్ధి పనుల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలోని కొబ్బరిచెట్లను తొలగించడం వివాదస్పదంగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే సుబ్బరాజు శివాలయాన్ని సందర్శించి ఆలయ అధికారులు, స్థానిక నాయకులతో మాట్లాడారు. కొబ్బరిచెట్ల తొలగింపుపై ఎమ్మెల్యే ఆలయ ఈవో సోమరాజును ప్రశ్నించగా ఆయన స్పష్టమైన సమాధానం చెప్పకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈఓపై చర్య తీసుకోవాలని దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరలో ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే సుబ్బరాజు తెలియజేసారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ శాకా శంకరుడు, నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బిళ్లకుర్రులో బాధిత కుటుంబానికి బియ్యం, నగదు అందజేస్తున్న జగ్గిరెడ్డి

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రులో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి బియ్యం, నగదు అందజేశారు. బిళ్లకుర్రు అంబేడ్కర్ కాలనీలో గోడా లక్ష్మి తాటాకింట్లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించి పూర్తిగా దగ్ధమైంది. ఆ బాధిత కుటుంబాన్ని జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి సోమవారం పరామర్శించి, మానవతా దృక్పథంతో వ్యక్తిగతంగా 25 కేజీల బియ్యం, రూ.5 వేలు అందజేశారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, రాష్ట్ర పార్టీ ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, స్థానిక సర్పంచ్ నెల్లి లక్ష్మీపతిరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాకర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈడీసీ చైర్మన్, నూతన కార్యవర్గం ఎన్నిక



చొల్లంగి సీబీఈటీ నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న అధికారులు

తాళ్లరేవు: మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రదేశమైన సీబీఈటీ (కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం) చైర్మన్‌ను సోమవారం ఎన్నుకున్నారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో లాటరీ పద్ధతిలో నూతన చైర్మన్‌ను ఎంపిక చేశారు. చొల్లంగి స్నానాలరేవుకు చెందిన శ్రీ సంగమేశ్వర ఈడీసీ అధ్యక్షుడు పినిపోతు ధనంజయ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ చైర్మన్ ధనంజయను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు కె.మహేష్ కె.ధనంజయ రావు, జి.గోపి నాగేంద్రకుమార్, పి.సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్‌కు నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

ముమ్మిడివరం: జోసెస్ క్రైస్ట్ పాస్టర్స్ ఫెలో సిఫ్ ముమ్మిడివరం మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ముమ్మిడివరంలో వరల్డ్ పీస్ ఇవాంజిలికల్ చర్చిలో కె. ప్రభుదానం ఆధ్వర్యంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని నియమించారు. అధ్యక్షుడిగా రెవ. బిషప్, బండి సుదర్శనరాజు, గౌరవాధ్యక్షుడిగా రెవ.బిషప్, వజ్రపు జోసెఫ్, కందికట్ల ప్రభుదానం, ఉపాధ్యక్షులుగా రెవ.కామాడి జాన్‌ప్రసాద్, కార్యదర్శిగా రెవ.సాపే స్టీపెన్‌పాల్, సహకార్యదర్శిగా రెవ.గుండపు సురేష్‌కుమార్, కోశాధికారిగా రెవ. ఉండ్రాజవరపు ప్రసాద్, సహాయ కోశాధికారిగా డాక్టర్ మల్లివరపు దావీదురాజు, ముఖ్య సలహాదారులుగా పల్లి డేవిడ్‌రాజు, నక్కా క్రిస్టోపర్ నియమితులయ్యారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సహాయం



కిడ్నీ బాధితుడు ఆనంద్‌కు ఆర్థిక సాయం అందజేస్తున్న రమణారావు

అమలాపురం టౌన్: బండారులంకకు చెందిన సరెళ్ల వెంకట ఆనంద్‌కు రెండు కిడ్నీలు దెబ్బతిని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబానికి చెందిన ఆనంద్ పరిస్థితిని గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచే వెంకటరమణారావు దృష్టికి ఆ గ్రామానికి చెందిన కొందరు తీసుకువచ్చారు. రమణారావు స్పందించి ఆనంద్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. స్థానిక గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో బాధితుడు ఆనంద్‌కు రూ.15 వేల చెక్‌ను రమణరావు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సరెళ్ల రామకృష్ణ, పార్టీ నాయకులు పందిరి సుబ్బరాజు, నేరేడుమిల్లి శ్రీను, నేలపూడి సుగంధ కుమార్, దంగేటి సుబ్బు, గంటా లక్ష్మీ ప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఉప్పలగుప్తం: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అన్నారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధిలో సోమవారం ముమ్మర పారిశుధ్య పనులను సర్పంచ్ ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. వీధుల్లో శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరిగెల నానాజీ, కార్యదర్శి ఎండీ షెహేన్ షా పాల్గొన్నారు.

వ్యాయామశాల ప్రారంభం



వ్యాయామ శాలను ప్రారంభిస్తున్న న్యాయవాది శశిధర్ శ్రీరామ్ దంపతులు

అమలాపురం టౌన్: స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్ బ్రాంచి పక్క భవనంలో దాతల సహకారంతో స్వామి వివేకానంద జిమ్ అండ్ యోగా వ్యాయామ శాల ఏర్పాటైంది. ఈ జిమ్ అండ్ యోగా వ్యాయామశాలను సీనియర్ న్యాయవాది కూచిమంచి శశిధర్ శ్రీరామ్, సుజాత దంపతులు సోమవారం ప్రారంభించారు. యోగా, వ్యాయామ పరికరాలను పలువురు దాతలు సమకూర్చారని యోగా గురువు, జిమ్ కోచ్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. దాతలు బి.గోపాలకృష్ణ, గోకవరపు నాగేశ్వరరావు, వైవీ నరసింహరావు, జవ్వాది తాతబాబు, చిరుపూరి రంగరాజు, తురగా సాయికుమార్, బీవీఎస్ వర్మ, తురగా చిన్ని తదితరులు పరికరాలను సమకూర్చారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఏరులై పారుతున్న కల్తీ మద్యం



కాశి రామకృష్ణ

ముమ్మిడివరం: కూటమి నాయకుల అండదండలతో కల్తీ మద్యం రాష్ట్రంలో ఏరులై పారుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ ఆరోపించారు. ఆయన సోమవారం ముమ్మిడివరంలో మాట్లాడుతూ బెల్ట్ షాపుల్లో, దాదాపు కల్తీ మద్యమే విక్రయిస్తున్నారని, ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుంటే కల్తీ మద్యం తయారీదారులు పేట్రేగిపోతున్నారన్నారు. దీనికి పూర్తిస్థాయిలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి బాధ్యత వహించాలన్నారు. కూటమి నాయకులు మద్యం పేరుతో వ్యాపారాలు చేసి రూ.కోట్లు వెనకేసుకుంటున్నారన్నారు. కోనసీమ జిల్లాలో కల్తీ మద్యం తయారీదారులపై నామమాత్రపు కేసులు పెట్టి కల్తీదారులకు అధికారులు అండదండలు అందిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అధికారికంగా మద్యం షాపుల్లో కల్తీ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. కల్తీ మద్యం వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గోపి

యానాం: పురపాల ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం యానాంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా చెల్లి గోపీనాథ్, ఉపాధ్యక్షుడిగా వి.వీరకుమార్, గూటం రాంబాబు, కార్యదర్శిగా యనమదల రాంబాబు, ఉపకార్యదర్శిగా వి.తేజకిరణ్మయి, కోశాధికారిగా టి.రమాదేవిని ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా సంగాడి శ్రీనివాస్, అత్తిలి గోవిందరాజు, పి జయకృష్ణ, పి.దుర్గారావు, పి.పాప ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

బిల్లుల కోసం కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

అమలాపురం రూరల్: ఉపాధి హామీ పథకంలో పల్లె పండుగ పథకంలో రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసి పది నెలలైనా ప్రభుత్వం బిల్లు చెల్లించలేదని కాంట్రాక్టర్లు సోమవారం అమలాపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ మేరకు బిల్లు తక్షణమే చెల్లించాలని వారు కోరారు. రాయపరెడ్డి శ్రీనివాసరావు, సామా బుచ్చిరామయ్య, పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. బిల్లుల కోసం పీఆర్ కమిషనర్ కృష్ణతేజను కలిసి విన్నవించి ఐదు నెలలైనా ఇప్పటికీ స్పందన లేదని వారన్నారు. బిల్లులు రాకుంటే ఆత్మహత్యలు చేసుకోవలసి వస్తుందని వారు హెచ్చరించారు.

పీఈటీ విష్ణు ప్రసాద్‌కు సత్కారం



వన్నె చింతలపూడిలో విష్ణుప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

అమలాపురం రూరల్: ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పీఈటీ పరమట విష్ణు ప్రసాద్‌ను వన్నె చింతలపూడిలో అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కమిటీ అధ్యక్షుడు పరమట ఏడుకొండలు అధ్యక్షతన సర్పంచ్ రాజారత్న నాగవాణి, ఎంపీటీసీ పరమట నాగమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు విష్ణు ప్రసాద్‌ను సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు రాంబాబు రాజు, ఉప సర్పంచ్ వెత్రిఅబ్బాయి, మాజీ సర్పంచ్‌లు పరమట మోహన్‌కుమార్, అర్జున వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ వైథిలింగం నేడు రాక

యానాం: పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు వి.వైథిలింగం మంగళవారం యానాం రానున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్ధాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి తెలిపారు. స్థానిక గాజుల గార్డెన్స్‌లో మధ్యాహ్నం నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. మాజీ సీఎం నారాయణసామి, మాజీ మంత్రి కందసామి, అనంతరామన్ తదితరులు హాజరు కానున్నట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థిని ఎంపిక



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అయినవిల్లి: మండలంలోని నేదునూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాగిత రేష్మా కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సోమవారం జరిగిన తూర్పుగోదావరి జిల్లా బీచ్ వాలీబాల్ సెలెక్షన్స్‌లో ఎంపికైంది. నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రేష్మా ప్రతిభ కనబరిచి–14 జిల్లా జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీఎస్‌వీవీ ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన విద్యార్థి కాగిత రేష్మా, పీడీ శివకుమార్‌ను నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఎంపీటీసీ–1, 2 సభ్యులు కళ్లేపల్లి సుబ్బరాజు, ఇందుగుల వెంకట్రామయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పసుపులేటి చంటి, మాజీ చైర్మన్ బండి శ్రీరాములు అభినందించారు.